


పోలింగ్ కేంద్రాలు సిద్ధం

ఆర్‌డిఒ అద్దయ్య

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

పోలవరం నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాలను సిద్ధంగా ఉంచామని, ఎన్నికల నోటిఫికేషన్ వస్తే ఎలక్షన్ నిర్వహించడానికి సిద్ధంగా ఉన్నామని ఆర్‌డిఒ అద్దయ్య తెలిపారు. బుట్టాయగూడెం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లతో గురువారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలోని తప్పొప్పులను సరి చేసుకోవడానికి అవకాశం ఉంటుందని, ఈ నిరంతర ప్రక్రియను ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. పోలవరం నియోజకవర్గంలో సమస్యాత్మకమైన కేంద్రాలను గుర్తించి, ఆ కేంద్రాల్లో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవడానికి అనుగుణంగా అధికారులతో ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రమేష్, వివిధ రాజకీయ పార్టీల బూత్ ఏజెంట్లు పాల్గొన్నారు.

సాగుకు సాయం.. నై నై..!



మోడీ సర్కార్ ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో వ్యవసాయానికి మొండిచెయ్యి చూపించింది. గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌ను పార్లమెంట్‌లో ప్రవేశపెట్టారు. ఎన్నికల వేళ ప్రవేశపెడుతున్న ఈ బడ్జెట్‌లో రైతులకు వరాలు కురిపించనున్నట్లు పెద్దఎత్తున ప్రచారం సాగింది. కేంద్రం పిఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద రైతులకు ఏడాదికి రూ.ఆరు వేలు ఇస్తోంది. ఈ సొమ్మును రూ.తొమ్మిది వేలకు పెంచనున్నట్లు ప్రచారం నడిచింది. దీంతో ఎంతోకొంత రైతులకు మేలు జరుగుతుందని అంతా ఆశించారు. బడ్జెట్‌లో దానికి సంబంధించిన ఊసేలేకుండా పోయింది.

- కేంద్ర బడ్జెట్‌లో రైతుకు మోడీ సర్కార్ దగా
- పిఎం కిసాన్ సమ్మాన్‌నిధి పెంపు తూచ్
- మద్దతు ధరల గ్యారెంటీ చట్టం ఊసే కరువు
- పోలవరానికి నిధులు సున్నా
- రైల్వే ప్రాజెక్టులు, నిట్‌కు నిధులపైనా అంతే
- ఆదాయ పన్ను పరిమితిపై వేతన జీవులకు నిరాశ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

జిల్లాలో 80 శాతం ప్రజలు వ్యవసాయ రంగంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పిఎం కిసాన్ సమ్మాన్ నిధి పెంచితే జిల్లా రైతాంగానికి కొంత మేలు జరిగే అవకాశం ఉంటుందని అంతా భావించినా నిరాశే మిగిలింది. ఈసారి బడ్జెట్‌లో కౌలురైతులకు వర్తించేలా ఈ నిధిలో మార్పులు జరుగుతాయని భావించారు. మోడీ సర్కార్ ఆ ఊసే లేకుండా చేసింది. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం చేయాలంటూ రైతులు మోడీసర్కార్‌పై ఎప్పటి నుంచో పోరాడుతున్నారు. ఈ చట్టం చేస్తే రైతులకు మేలు జరిగే అవకాశం ఉన్నా మోడీ సర్కార్ ఈ బడ్జెట్ ఆ దిశగా ప్రయత్నమే చేయలేదు. జిల్లాలో వరిసాగు పెద్దఎత్తున ఉంది. ప్రస్తుతం వరికి క్వింటాల్‌కు రూ,2,183 మాత్రమే ధర ఉంది. మద్దతు ధర గ్యారెంటీ చట్టం తెస్తే వరికి క్వింటాల్‌కు రూ.2,800కుపైగా ధర లభిస్తుంది. ఇది జిల్లా రైతాంగానికి ఎంతోమేలు. జిల్లాలో అత్యధికంగా సాగయ్యే పామాయిల్, ఆక్వాకు సైతం మేలు చేసేలా ఈ బడ్జెట్‌లో ఏఒక్కటీ లేకపోవడంతో రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. భారీగా పెరిగిన ఎరువుల ధరలపైనా కేంద్రప్రభుత్వం రైతులకు ఊరటనిచ్చే ప్రయత్నం చేయలేదు.

పోలవరానికి నిధులు సున్నా..

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి నిధుల కేటాయింపులో కేంద్ర ప్రభుత్వం తన చివరి బడ్జెట్‌లోనూ మొండిచెయ్యి చూపింది. దీంతో పోలవరం నిర్వాసితులకు ఇప్పట్లో పరిహారం అందే పరిస్థితి లేకుండాపోయింది. నిర్వాసితులకు పునరావాసం, పరిహారానికి రూ.30 వేల కోట్లకుపైగా ఖర్చవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తేల్చింది. పోలవరానికి పూర్తిస్థాయి నిధులను కేంద్రమే ఇవ్వాల్సి ఉంది. మధ్యంతర బడ్జెట్‌లోనూ పోలవరం ఊసే లేకుండా కేంద్రం వ్యవహరించింది. ఇది నిర్వాసితుల కుటుంబాలపై తీవ్ర ప్రభావం చూపనుంది.

రైల్వే ప్రాజెక్టులు, నిట్‌కు నిధులూ అంతే..

జిల్లాలో కొవ్వూరు-భద్రాచలం, నరసాపురం-కోటిపల్లి రైల్వేలైన్లకు సంబంధించిన నిధుల కేటాయింపుల్లోనూ జిల్లా ప్రజానీకానికి నిరాశే మిగిలింది. బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించిన రైల్వేలైన్ల ఊసే లేకుండాపోయింది. కేంద్ర విద్యాసంస్థ నిట్‌కు కేటాయింపులపై బడ్జెట్‌లో స్పష్టత లేదు. దీంతో 2024 మధ్యంతర బడ్జెట్‌లో జిల్లాకు సంబంధించి ఎటువంటి మేలూ లేకుండా పోయింది.

వేతన జీవులకు నిరాశే..

ఆదాయపు పన్ను పరిమితిని రూ.2.50 లక్షల నుంచి రూ.ఐదు లక్షలకు పెంచే అవకాశం ఉందని వేతన జీవులు భావించారు. అయితే బడ్జెట్ ప్రసంగంలో ఆదాయపు పన్ను పరిమితికి సంబంధించి మార్పులు ఏవీ ఉండబోవని, యథాతథంగా ఉంటాయని ఆర్థికమంత్రి స్పష్టం చేశారు. దీంతో వేతన జీవులకు మరోసారి నిరాశే మిగిలింది.



మాట్లాడుతున్న యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్

ఆర్థిక బకాయిల చెల్లింపుపై చర్చేదీ

మంత్రి మండలి సమావేశం తీరుపై యుటిఎఫ్ అసంతృప్తి

ముగిసిన రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఏలూరు కలెక్టరేట్ వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారం సాయంత్రం ముగిశాయి. రెండోరోజు దీక్షా శిబిరాన్ని జిల్లా అధ్యక్షులు ముస్తఫా ఆలీ ప్రారంభించారు. సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి దీక్షాధారులకు నిమ్మరసం ఇచ్చి దీక్షలు ముగించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఆర్థిక బకాయిల చెల్లింపు కోరుతూ యుటిఎఫ్ ఇప్పటికే అనేక పోరాటాలు చేసిందని, తాజాగా రెండు రోజులు రిలే నిరాహార దీక్షలు చేపట్టిందని తెలిపారు. అయితే బుధవారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో ఐఆర్, పిఆర్‌సి, ఆర్థిక బకాయిల చెల్లింపు తదితర ఆర్థిక పరమైన అంశాలపై ఒక ప్రకటన కూడా చేయకపోవడం, చర్చించకపోవడం శోచనీయమన్నారు. సుమారు 30 వేలకుపైగా ఉపాధ్యాయ పోస్టులు డిఎస్‌సి ద్వారా నియమించాల్సి ఉండగా కేవలం 6,100 పోస్టులతో మెగా డిఎస్‌సి ప్రకటించడం హాస్యాస్పదమని, నిరుద్యోగులను నిరాశపర్చడమేనని అన్నారు. ఇప్పటికైనా మొత్తం ఖాళీ ఉపాధ్యాయ పోస్టులన్నీ భర్తీ చేసేలా మెగా డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఆర్థిక బకాయిల చెల్లింపు కోసం రాబోయే రోజుల్లో రాష్ట్రస్థాయిలో పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. పాత పెన్షన్ సాధించేవరకు ఓట్ ఫర్ ఒపిఎస్ నినాదంతో కార్యక్రమాలు నిర్వహిస్తామని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బి.సుభాషిణి, జిల్లా కార్యదర్శి బి.అనురాధ, ఎన్.రాంబాబు, జి.దేవానందరావు, సుధారాణి, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ బి.మోహన్‌రావు, వివిధ మండలాల నేతలు పాల్గొన్నారు.

తహశీల్దార్ సోమశేఖర్‌కు ఉద్యోగోన్నతి

సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియామకం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్‌కు ఉద్యోగోన్నతి లభించింది. డిప్యూటీ కలెక్టర్ హోదాలో ప్రభుత్వం ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఏలూరు జిల్లా సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వె.ప్రసన్నవెంకటేష్‌ను సోమశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సోమశేఖర్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు.



కలెక్టర్‌కు మొక్క అందిస్తున్న సోమశేఖర్

ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను నిరసిస్తూ మానవహారం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్



న్యాయవాదుల మానవహారం

ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను నిరసిస్తూ న్యాయవాదులు నూజివీడు పట్టణంలోని కోర్టు భవనాల వద్ద గురువారం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇందుపల్లి సత్యప్రకాష్ మాట్లాడుతూ భూ యజమానులు తమ భూములపై హక్కును కోల్పోయేలా పాలకులు ఎపి ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ తీసుకొచ్చారని విమర్శించారు. ఈ యాక్ట్‌ను రద్దు చేసే వరకూ ఆందోళన కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో లాయర్లు డెక్సన్, నరసింహారావు, బసవరావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఎంఇఒకు వినతిపత్రం అందిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

సమస్యల పరిష్కారం కోరుతూ ఎంఇఒకు వినతి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు బుట్టాయగూడెం ఎంఇఒ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంఇఒ బాబూరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మొడియం నాగమణి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సంఖ్యను పెంచడానికి, పిల్లలకు రుచికరమైన పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలవుతుందన్నారు. మంచి లక్ష్యంతో ప్రారంభించిన అటువంటి ఈ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నీరు గారుస్తున్నాయన్నారు. ఈ పథకాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. గత 23 ఏళ్ల నుంచి మధ్యాహ్న భోజన పథకంలో పని చేస్తున్న కార్మికులతో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న ఆ ప్రభుత్వం వెట్టి చాకిరీ చేయిస్తుందన్నారు. సిఎం జగన్ అధికారంలోకి రాకముందు పాదయాత్ర సందర్భంగా తాము అధికారంలోకి వస్తే రూ.పది వేల వేతనం ఇస్తామన్న హామీని అమలు చేయాలన్నారు. ప్రతి నెలా ఐదో తేదీ లోపు వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, మెనూ ఛార్జీలు రూ.20కు పెంచాలని, ప్రభుత్వమే గ్యాస్ సరఫరా చేయాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, వంట చేసేటప్పుడు అగ్ని ప్రమాదానికి గురైన వారికి నష్ట పరిహారం చెల్లించాలని, సంవత్సరానికి రెండు జతలు యూనిఫాం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బక్కా మహాలక్ష్మి, పూనెం వెంకటలక్ష్మి, గంగాదేవి, సత్యవతి, పోచమ్మ, రామలక్ష్మి, పెంటమ్మ, నాగలక్ష్మి పాల్గొన్నారు.

దోసపాడు దళితుల సమస్యలు పరిష్కరించాలి

సిఎం జగన్‌కు వ్యకాస జిల్లా కమిటీ బహిరంగ లేఖ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దోసపాడు దళితుల సమస్యలు పరిష్కరించాలని సిఎం జగన్‌కు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ కార్యదర్శి రామకృష్ణ బహిరంగ లేఖ రాశారు. దోసపాడులో నూటికి 90 శాతం దళితులు వారికి ప్రభుత్వం 1956 నుంచి దఫదఫాలుగా అసైన్డ్, సీలింగ్ భూములు పంపిణీ చేశారని, ఆ భూములను విజయవాడకు చెందిన సంపన్నులు, దేవినేని బాజీప్రసాద్‌తో పాటు పలువురు బలవంతంగా ఆక్రమించి, చట్టవిరుద్ధంగా అసైన్డ్, సీలింగ్ భూముల్లో చేపలు, రొయ్యల చెరువులు తవ్వి అనుభవిస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు వీరిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పుడు పేదలను భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డగిస్తున్నారన్నారు. గ్రామంలో సెక్షన్ 144, 145 పెట్టి పోలీసులుతో భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. చట్ట విరుద్ధంగా భూములు అనుభవిస్తున్నవారిపై ఎలాంటి కేసులు పెట్టకుండా వారిని భూముల్లో సాగు చేసుకునే విధంగా రెవెన్యూ అధికారులు వ్యవహరిస్తున్నారన్నారు. 2006 నుంచి సుమారు 18 ఏళ్ల నుంచి జిల్లా, మండల రెవెన్యూ కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా తిరిగినా తమ సమస్య పరిష్కారం కాలేదన్నారు. జిల్లా కోర్టు వారిని ఆశ్రయించగా స్టేటస్ కో ఆర్డర్ ఇచ్చారన్నారు. జిల్లా అధికారులు ఆ భూములు స్వాధీనపరుచుకుని తమకు ఇప్పించాలని కోరారు. తమ జీవనోపాధికి, వ్యవసాయానికి సహకరించాలని, తమకు తగు న్యాయం చేయాలని కోరారు. దీనిపై జిల్లాకు ఈ నెల 3న వస్తున్న సిఎం జగన్ స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

రాష్ట్రస్థాయిలో చింతలపూడి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి సైన్స్ ఫెయిర్‌లో ప్రతిభ కనబరిచారని ఎంఇఒ కిరణ్‌బాబు తెలిపారు. జనవరి 27వ తేదీ నుంచి ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి సైన్స్ ఫెయిర్‌లో చింతలపూడి హైస్కూల్ విద్యార్థులు ప్రథమ నగదు బహుమతి సాధించారు. ఈ విద్యార్థులు గతంలో జరిగిన జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి ప్రథమ బహుమతులు గెలుపొందినట్లు ఎంఇఒ తెలిపారు. రాష్ట్ర స్థాయికి వెళ్లి అక్కడ కూడా ప్రథమ నగదు బహుమతి సాధించినట్లు తెలిపారు. ఈ విద్యార్థుల సాధించిన విజయం జిల్లాకు గర్వకారణమన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అభినందించారు.



బహుమతి అందుకుంటున్న విద్యార్థులు



ఏలూరులో అభివాదం చేస్తున్న టిడిపి నేతలు

5న చింతలపూడిలో 'రా.. కదలిరా'

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

చింతలపూడిలో ఈ నెల ఐదో తేదీన నిర్వహించనున్న 'రా.. కదలిరా' బహిరంగ సభను విజయవంతం చేయాలని తెలుగుదేశం నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఆ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఇన్‌ఛార్జీలు, ముఖ్యనాయకులు పాల్గొన్నారు. పరిశీలకులు కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణ, దేవినేని ఉమ, కెఎస్.జవహర్ మాట్లాడుతూ చంద్రబాబు సభకు నియోజకవర్గాల వారీ జనసమీకరణపై ప్రత్యేక కేంద్రీకరణ చేయాలన్నారు. ఈ సమావేశంలో చింతమనేని ప్రభాకర్, పీతల సుజాత, మాగంటి బాబు, బడేటి రాధాకృష్ణ, ఘంటా మురళీకృష్ణ, వలవల బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి: ఈ నెల 5న చంద్రబాబు పాల్గొనే బహిరంగ సభ ప్రాంతాన్ని మాజీ మంత్రి కొల్లు రవీంద్ర గురువారం పరిశీలించారు. ఆయన వెంట నేతలు కొనకళ్ల నారాయణ, గన్ని వీరాంజనేయులు, జగ్గవరపు. ముత్తారెడ్డి, ఘంటా మురళీ, దాసరి ఆంజనేయులు పాల్గొన్నారు.

దారి మళ్లింపునకు వాహనదారులు సహకరించాలి

3న సిఎం జగన్ బహిరంగ సభ నేపథ్యంలో ఇబ్బందుల్లేకుండా ముందస్తు చర్యలు

ఎస్‌పి మేరీప్రశాంతి



ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ఈ నెల మూడో తేదీన జరిగే సిఎం జగన్ బహిరంగ సభకు దాదాపు మూడు లక్షల మంది హాజరవుతారని పోలీసు శాఖ అంచనా వేసిందని, సభ మొదలై ముగిసే వరకు జాతీయ, రాష్ట్ర రహదారిలో వాహనాల దారి మళ్లింపునకు రంగం సిద్ధం చేశామని, ఇందుకు వాహనదారులు సహకరించాలని ఎస్‌పి మేరీప్రశాంతి కోరారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో ఎస్‌పి గురువారం సాయంత్రం విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం జగన్ బహిరంగ సభ ఈ నెల మూడో తేదీ ఏలూరు రూరల్ పరిధిలో నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ సభకు దాదాపు మూడు లక్షల మంది ప్రజలు హాజరవుతారని పోలీసు శాఖ ఒక అంచనా వేసిందన్నారు. దీంతో రహదారులన్నీ వాహనాలతో నిండిపోతాయన్న ఉద్దేశంతో సభ నిర్వహించే సమయానికి ముందస్తుగానే వాహనాలను మళ్లింపు చేస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. ఈ మళ్లింపునకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆమె కోరారు. ఈ మళ్లింపు పరిస్థితులకు అనుగుణంగా ఒక్కోవైపు మారుస్తూ ఉంటామని కూడా ఆమె స్పష్టం చేశారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా వాహనదారులు ఇబ్బంది పడకుండా ఈ చర్యలు చేపట్టామన్నారు. విజయవాడ కమిషనర్‌రనూ, ప్రస్తుతం నాలుగు జిల్లాల ఎస్‌పిలతోనూ వాహనాల మళ్లింపులపై చర్చలు జరిపామని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కమిషనరేట్‌లో కూడా వాహనాల మళ్లింపులపై స్పష్టమైన రిపోర్టును పంపించామన్నారు. వారు కూడా ఈ మళ్లింపులకు సహాయ సహకారాలను అందిస్తామని తెలిపారన్నారు. ఈ సమావేశంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు, ఏలూరు డిఎస్‌పి ఇ.శ్రీనివాసులు పాల్గొన్నారు.

వాహనాల మళ్లింపు ఇలా..

విశాఖపట్నం నుండి విజయవాడ చెన్నై వెళ్లే వాహనాల మళ్లింపు ఇలా

కత్తిపూడి జంక్షన్ వద్ద వాహనాలను మళ్లించి గొల్లప్రోలు, కాకినాడ, అమలాపురం, చించినాడా బ్రిడ్జి వద్ద నుంచి నరసాపురం, మొగల్తూరు, మచిలీపట్నం మీదుగా వెళ్తాయి. పెరవలి సిద్ధాంతం వద్ద పెనుగొండ, పాలకొల్లు, నరసాపురం, మొగల్తూరు మీదుగా వాహనాలు మళ్లిస్తారు.

విశాఖపట్నం నుండి హైదరాబాదు వెళ్లే వాహనాలు దారి మళ్లింపు ఇలా

విశాఖ నుండి హైదరాబాద్ వెళ్లే వాహనాలు దేవరపల్లి వద్ద దారి మళ్లిస్తారు. దేవరపల్లి, గోపాలపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, అశ్వారావుపేట, సత్తుపల్లి, ఖమ్మం మీదుగా సూర్యాపేట చేరుకుంటాయి.

తాడేపల్లిగూడెం నుండి మరో దారిలో హైదరాబాద్ వాహనాలు మళ్లింపు

తాడేపల్లిగూడెం, నల్లజర్ల, కొయ్యలగూడెం, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి మీదుగా హైదరాబాదు చేరుకుంటాయి.

నారాయణపురం వద్ద మరో మళ్లింపు

దోబచర్ల, భీమడోలు, ద్వారకాతిరుమల, కామవరపుకోట, జంగారెడ్డిగూడెం మీదుగా హైదరాబాద్ వెళ్తాయి.

నెల్లూరు నుండి విశాఖపట్నం వచ్చే వాహనాల మళ్లింపు ఎలా

నెల్లూరు నుంచి వచ్చే వాహనాలు ఒంగోలు వద్ద దారి మళ్లించి తోవగుంట, బాపట్ల, చీరాల, రేపల్లె, అవనిగడ్డ, మచిలీపట్నం, చించినాడా, రాజోలు, అమలాపురం, కాకినాడ మీదుగా చేబ్రోలు జాతీయ రహదారికి చేరుకుని అక్కడి నుండి విశాఖపట్నం వెళ్తాయి. విజయవాడ తరువాత ఎనికెపాడు వద్ద మరో మళ్లింపు చేశారు. నేరుగా మచిలీపట్నం హైవేలో ఈ దారి మళ్లింపు ఉంటుంది. హనుమాన్ జంక్షన్ వద్ద నుండి నూజివీడు, రామన్నపేట అడ్డరోడ్డు, ధర్మాజీగూడెం, చింతలపూడి మీదుగా విశాఖపట్నం వెళ్తాయి.

హైదరాబాద్ నుండి విశాఖపట్నం వెళ్లే వాహనాల దారి మళ్లింపు ఇలా

ఈ వాహనాలన్నిటిని సూర్యాపేట వద్ద దారిమళ్లించి ఖమ్మం, వైరా, సత్తుపల్లి, అశ్వారావుపేట, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి నుండి విశాఖపట్నం చేరుకుంటాయి. ఇబ్రహీంపట్నం వద్ద హైదరాబాద్ వాహనాలు మైలవరం, తిరువూరు, సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి నుండి విశాఖపట్నం చేరుకుంటాయి.

ఏలూరు నుండి బయటకు వెళ్లే ద్విచక్ర వాహనాలు, కారుల దారి మళ్లింపు

సమరపాడు, జోగన్నపాలెం, సీతంపేట, తిరుమల డైరీ మీదుగా వాహనాలు దారి మళ్లుతాయి. రాజమండ్రి వైపు నుండి నగరంలోకి వచ్చే వాహనాలు కొవలి బ్రిడ్జి కొవలి గ్రామం, పాలగూడెం, వట్లూరు, కలపర్రు మీదుగా విజయవాడ చేరుకుంటాయి

ఇంటర్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

కలెక్టర్ ప్రసన్నవెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో ఇంటర్మీడియేట్ పరీక్షల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేశామని కలెక్టర్ ప్రసన్నవెంకటేష్ తెలిపారు. 35,949 మంది విద్యార్థులు పరీక్షలు రాసేందుకు 50 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. విజయవాడ ఎపి సెక్రటేరియట్‌లోని సిఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కెఎస్.జవహర్‌రెడ్డి పలు అంశాలపై జిల్లా కలెక్టర్లతో గురువారం సమీక్షించారు. రెవెన్యూ, రీసర్వే మూడో దశ, ఇనామ్, అసైన్డ్ భూములు, స్త్రీ, శిశు సంక్షేమం - ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ పథకం, ఆరోగ్యం, వైద్యం, కుటుంబ సంక్షేమం, జగనన్న ఆరోగ్య సురక్ష, ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ, పి, ఆర్‌డి, ఎన్‌ఆర్‌ఇజిఎస్-కరువు మండలాల్లో వేతన ఉత్పత్తి, తాగునీరు, ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు, సీసీ టివి ప్రాజెక్టు పలు అంశాలపై నిర్వహించిన సమీక్షలో జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సంబంధిత అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించామని కలెక్టర్ వివరించారు. జిల్లాకు ఇప్పటివరకు 3,52,275 కొత్త ఆరోగ్యశ్రీ కార్డులు అందగా, వాటిలో ఇప్పటివరకు 2,62,326 కార్డులు పంపిణీ చేశామని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డిఎంహెచ్‌ఒ డాక్టర్ ఎస్.శర్మిష్ట, ఐసిడిఎస్ పీడీ పద్మావతి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్, డిఇఒ శ్యాంసుందర్, డివిఇఒ బి.ప్రభాకరరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వాలంటీర్ల ధర్నా

ప్రజాశక్తి - బుట్టాయగూడెం



దీక్షల్లో ఉపాధ్యాయ వాలంటీర్లు

తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ వాలంటీర్లు మండలంలోని కెఆర్.పురం ఐటిడిఎ కార్యాలయంలో చేపట్టిన దీక్షలు గురువారంతో నాలుగో రోజుకు చేరుకున్నాయి. నాలుగో రోజున పిడిఎస్‌యు జిల్లా కమిటీ వారికి మద్దతు తెలపింది. ఎస్.మోహన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో విద్యార్థుల విద్యా నైపుణ్యాలు మెరుగుపడాలంటే మాతృభాషలోనే విద్యా బోధన జరగాలన్నారు. ఈ విధంగా విద్యనందిస్తున్న కోయ భారతి ఉపాధ్యాయులకు న్యాయమైన గౌరవ వేతనాన్ని అందించాలని కోరారు. పేస్కేలును అమలు చేయాలని, నిత్యావసర ధరల పెరుగుదలకు అనుగుణంగా వారి గౌరవ వేతనాన్ని కూడా పెంచాలని, శిక్షణా తరగతులను నిర్వహించి అర్హత సర్టిఫికెట్లను మంజూరు చేయాలని కోరారు. తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను తీర్చి విధుల్లోకి వెళ్లేలా చూడాలని డిమాండ్ చేశారు.

ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల నిర్వహణలో ఎంసిసి అతి ముఖ్యమైందని, ప్రతిఒక్కరూ ఎన్నికల కమిషన్ నిబంధనలు తప్పక పాటించాలని డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు అన్నారు. స్థానిక కలెక్టరేట్ గోదావరి మీటింగ్ హాలులో గురువారం నియోజకవర్గస్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఎన్నికల విధానం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ విధులపై జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్, పథక సంచాలకులు డిఆర్‌డిఎ ఆర్.విజయరాజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో నిష్పక్షపాతంగా, నిజాయితీగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏలూరు తహశీల్దార్ బి.సోమశేఖర్ పాల్గొన్నారు.

17 వరకు నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా కార్డుదారులకు సరఫరా చేసే నిత్యావసర సరుకుల పంపిణీ ఫిబ్రవరి ఒకటో తేదీ గురువారం నుంచి ప్రారంభించినట్లు జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. మొబైల్ డిస్పర్సింగ్ యూనిట్ (ఎండియు) ఆపరేటర్లు గురువారం నుంచి ప్రతిరోజు ఉదయం ఏడు గంటలకు నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం బియ్యం, పంచదార వంటి నిత్యావసర సరుకులను 17 తేదీ వరకు కార్డుదారుల ఇంటి వద్దనే పంపిణీ చేసేలా ఆదేశించామన్నారు. చౌక ధరదుకాణాల డీలర్లు ఎండియు ఆపరేటర్ల ద్వారా గురువారం నుంచి సరుకుల పంపిణీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నిత్యావసర సరుకుల పంపిణీలో ఫిర్యాదులు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 1967కు ఫోన్ చేయవచ్చని జెసి బి.లావణ్యవేణి తెలిపారు.

రైతాంగాన్ని నిరాశపర్చిన బడ్జెట్ : రైతు సంఘం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టిన కేంద్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్ రైతాంగాన్ని నిరాశపరిచిందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. స్థానిక అన్నే భవనంలో ఆయన కేంద్ర ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌పై మాట్లాడారు. రైతులకు మాటలు చెప్పి కార్పొరేట్లకు రాయితీలు ఇచ్చారని చెప్పారు. మద్దతు ధరలు చట్టం తీసుకొచ్చి స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం మద్దతు ధరలు అమలు చేయాలని రైతాంగం కోరుతున్నా అందుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రతిపాదన లేకపోవడం అన్యాయమన్నారు. ధాన్యానికి రూ.2183 మద్దతు ధర ఇస్తున్నారని, కాని రైతులు పెట్టిన ఖర్చుల రీత్యా రూ.2866 ఇవ్వాల్సి ఉందన్నారు. ఇది కార్పొరేట్ కంపెనీల అనుకూల బడ్జెట్ అని అన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. రైతుల రుణమాఫీపై ఎటువంటి ప్రతిపాదనలు లేకపోవడం అన్యాయమన్నారు. కౌలు రైతుల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో ఎటువంటి ప్రతిపాదనలు లేవన్నారు. ప్రజా వ్యతిరేక బడ్జెట్ రైతులంతా వ్యతిరేకించాలని కోరారు.

దోమల మందు పిచికారీ

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కైకరంలో దోమల నివారణ కోసం క్రిమి సంహారిక మందు పిచికారీ చేయిస్తున్నామని సర్పంచి సలగల గోపీ అన్నారు. గ్రామంలో మురుగు బోదెలు, నీటి నిల్వ ప్రదేశాల్లో మందులు వెదచల్లించారు. గ్రామంలో పారిశుధ్య నివారణ కోసం చర్యలు తీసుకున్నామని తెలిపారు.

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిఐ క్రాంతికుమార్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈజీ మనీ కోసం చెడు అలవాట్లకు బానిసై కొంతమంది పార్ట్ టైం జాబ్‌ల పేరుతో తక్కువ టైంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చంటూ, యూట్యూబ్ వీడియోలకు లైక్, షేర్ చేస్తే డబ్బులు ఇస్తామని ఆశ చూపుతూ ఫోన్లకు కాల్స్ రూపంలో కాని మెసేజ్‌ల రూపంలో కాని సందేశాలు పంపుతుంటారన్నారు. అలాంటివారిని నమ్మకుండ జాగ్రత్తగా ఉండాలని ఆయన సూచించారు. అటువంటి ఫిర్యాదులు ఏమైనా తమ దృష్టికి వస్తే సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నెంబర్లకు గాని, స్థానిక పోలీసులకు కాని ధైర్యంగా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ముఖ్యంగా ప్రతిఒక్కరూ సైబర్ నేరాల పట్ల నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని, వాటిపై అవగాహనతో ఉండాలని తెలిపారు.

సిపిఎంకు విరాళాలిచ్చి తోడ్పడండి

జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్

ప్రజాశక్తి - కలిదిండి

పేదల పక్షాన పోరాడే సిపిఎంకు విరివిగా విరాళాలు ఇచ్చి సహకరించాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ కోరారు. ప్రజా ఉద్యమాలను బలోపేతం చేసేందుకు విరాళాలు ఇవ్వాలని కోరుతూ కలిదిండిలో దుకాణాల వద్ద గురువారం విరాళాలు సేకరించారు. సిపిఎం స్పష్టమైన విధానంతో ప్రజల నుంచి సేకరించిన విరాళాలను ప్రజల కోసమే ఖర్చు చేస్తుందన్నారు. సిపిఎం మండల కార్యదర్శి శేషపు మహంకాళిరావు, వి.భాస్కరరావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, శ్రీకాంత్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు

సీసీ రోడ్లు ప్రారంభం

కలిదిండి :మండలంలోని గోపాలపురంలో రూ.8.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును, వెంకటాపురంలో రూ.8.89 లక్షల గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు, రూ.4.85 లక్షల మండల ప్రజా పరిషత్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి శ్రీదేవి, సర్పంచి అనపర్తి వడ్డికాసులు, ఉప సర్పంచి వాకాని నాగరాజు, మసిముక్కు వెంకటేశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షులు అంకెం నరసయ్య, వడ్లాని పార్థసారథి పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పేకాట స్థావరంపై దాడి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని దర్భగూడెం గ్రామ శివారులో పేకాటస్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని దర్భగూడెం గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బందితో శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో ఐదుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.7 వేల నగదు, 52 పేకముక్కలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వారందరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ముసునూరు :పేకాటాడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ పి.వాసు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రమణక్కపేట గ్రామంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్ఐ వాసు తన సిబ్బందితో గురువారం దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1135 నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

భర్త వేధిస్తున్నాడని భార్య ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

భర్త వేధిస్తున్నడని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ములగలంపల్లి గ్రామానికి చెందిన తుంపాటి గాంధీకి, ప్రియాంకకు 2005లో పెద్దల సమక్షంలో ప్రేమ వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. కొంత కాలం నుంచి తన భర్త గాంధీ మద్యం తాగి వచ్చి శారీరకంగా, మానసికంగా తనను వేధిస్తున్నాడని ప్రియాంక పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు గాంధీపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గైనకాలజిస్టును నియమించరూ..!

చింతలపూడి ప్రభుత్వాసుపత్రిలో పోస్టు ఖాళీ

సేవలందక గర్భిణుల తీవ్ర ఇబ్బందులు

ప్రయివేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తే రూ.వేలల్లో బిల్లు

అధికారులు చర్యలు తీసుకోవాలని పేదల వేడుకోలు



ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని ప్రగడవరం గ్రామానికి చెందిన నాలుగు నెలల గర్భిణి కడుపు నొప్పి వస్తుందిన చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి వెళ్లింది. అక్కడ గైనకాలజిస్ట్ లేకపోవడంతో ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్తే అక్కడ అబార్షన్ అయిందని, రూ.25 వేలు బిల్లు వేశారని బాధిత మహిళ వాపోయింది. బాధితులు బిల్లు ఎంతవుతుందని ముందుగానే ఎంత అడిగినా సమాధానం చెప్పలేదని, బిల్లు వేసి ఇంత కట్టాలని చెప్పారని బాధితులు లబోదిబోమన్నారు.

చింతలపూడి ప్రభుత్వ ఏరియా కమ్యూనిటీ ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవటంతో గర్భిణులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నాలుగు నెలల నుంచి ఆసుపత్రిలో గైనకాలజిస్ట్ లేని పరిస్థితి నెలకొంది. ఆసుపత్రిలో నెలకు 25 నుంచి 30 వరకు డెలివరీలు అవుతున్నాయి. గైనకాలజిస్ట్ లేకపోవడంతో ప్రయివేట్ ఆసుపత్రికి వెళ్లక తప్పడం లేదని గర్భిణులు వాపోతున్నారు. ప్రయివేట్ ఆసుపత్రిలో జేబుకు చిల్లిపడే విధంగా బిల్లుతో గుల్ల చేస్తున్నారని లబోదిబోమంటున్నారు. వారానికి ఒకరోజు బుధవారం మాత్రమే ప్రభుత్వాసుపత్రిలో ఉంటున్నారని, అత్యవసర, రాత్రి సమయాల్లో అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చింతలపూడి ఆసుపత్రికి తెలంగాణ రాష్ట్రం నుంచి, కృష్ణా జిల్లా నుంచి, లింగపాలెం, టి.నరసాపురం మండలాల నుంచి కూడా రోగులు వస్తూ ఉంటారు. ప్రభుత్వాసుపత్రిలో గైనకాలజిస్ట్ లేకపోవడంతో ఇదే అదనుగా చూసుకుని ప్రయివేట్ ఆసుపత్రులు పేదలేను దోచుకుంటున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆసుపత్రిలో పర్మినెంట్‌గా గైనకాలజిస్టును ఏర్పాటు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి

వరలక్ష్మీదేవి, ఐద్వా జిల్లా కమిటి సభ్యులు

ఆసుపత్రిలో పూర్తిస్థాయిలో గైనకాలజిస్ట్ అవసరం. వారంలో బుధవారం మాత్రమే రావడం వల్ల ఉపయోగం లేదు. పలు చోట్ల బస్సు సౌకర్యం కూడా లేకపోవడంతో అత్యవసర సమయంలో ఆసుపత్రికి వచ్చేందుకు రోగుల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. ఆసుపత్రిలో 24 గంటలు గైనకాలజిస్ట్ అందుబాటులో ఉండే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి.

అందుబాటులో డిప్యూటేషన్ గైనకాలజిస్ట్‌లు

హఫీజ్ ఖాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్

ఆసుపత్రికి పర్మినెంట్‌గా గైనకాలజిస్ట్ లేరు. గతంలో ఉన్న గైనకాలజిస్ట్ డిప్యూటేషన్‌పై వేరు ఆసుపత్రికి వెళ్లారు. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి డిప్యూటేషన్‌పై ప్రభుత్వాసుపత్రికి ముగ్గురు గైనకాలజిస్ట్‌లను ఏర్పాటు చేశారు. డిప్యూటేషన్ కారణంగా సాయంత్రం నాలుగు గంటల వరకే అందుబాటులో ఉంటారు. సాధారణ డెలివరీలు ఆసుపత్రిలో చేస్తున్నాం. రాత్రి సమయంలో ఎమర్జెన్సీ కేసులు వస్తే ఏలూరుకు రిఫర్ చేస్తున్నాం.

ముసునూరు ఎంపిడిఒగా పద్మావతి

ప్రజాశక్తి - ముసునూరు

ముసునూరు ఎంపిడిఒగా సిహెచ్.పద్మావతి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీలో భాగంగా భీమడోలు ఎంపిడిఒగా పని చేస్తున్న సిహెచ్.పద్మావతి ముసునూరు ఎంపిడిఒగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్లటానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రెవెన్యూ, పోలీసు, ఇతర ఉన్నత శాఖాధికారుల సమన్వయంతో పని చేస్తానని తెలిపారు.



పద్మావతి

ముదినేపల్లి ఎంపిడిఒగా గంగాధరరావు

ముదినేపల్లి : ముదినేపల్లి ఎంపిడిఒగా ఎన్ఎం.గంగాధరరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకోడేరు మండలం నుంచి బదిలీపై ఎన్నికల విధులు నిర్వహించడం కోసం ఆమె ఎంపిడిఒగా బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంపిపి మాట్లాడుతూ మండలాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేయాలని సూచించారు. తొలుత బాధ్యతలు స్వీకరించిన ఎంపిడిఒ గంగాధరరావుకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించారు. ప్రస్తుతం ఇక్కడ ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తున్న మల్లీశ్వరి గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం బదిలీపై వెళ్లారు.



బాధ్యతలు చేపట్టిన గంగాధరరావు

మండవల్లి ఎంపిడిఒగా బేబిశ్రీలక్ష్మి

మండవల్లి : మండవల్లి ఎంపిడిఒగా ఆర్.బేబిశ్రీలక్ష్మి గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నిర్వహణ ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో కొయ్యలగూడెంలో ఎంపిడిఒగా పని చేస్తున్న ఆమెను మండవల్లికి బదిలీ ఉత్తర్వులు జారీ చేశారు. బేబీ శీలక్ష్మి మండవల్లి ఎంపిడిఒగా ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు మండవల్లి ఎంపిడిఒగా విధులు నిర్వహించిన వెంకటరమణ క్రోసూరు మండలం ఎంపిడిఒగా బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండవల్లి మండలాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు తన వంతు కృషి చేస్తానని ఆమె తెలిపారు. బాధ్యతలు తీసుకోవడానికి వచ్చిన బేబీ శ్రీలక్ష్మిని కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు ఘనంగా స్వాగతం పలికారు.



బేబిశ్రీలక్ష్మి

తహశీల్దార్‌కు వీడ్కోలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి తహశీల్దార్‌గా పని చేస్తున్న కె.శ్రీనివాస్ ఎన్నికల విధులు నిర్వహించడం కోసం పశ్చిమగోదావరి జిల్లా భీమవరం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో తహశీల్దార్‌కు వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విఆర్ఒలు అసోసియేషన్ తహశీల్దార్ శ్రీనివాస్‌ను ఘనంగా సత్కరించి ఆయన సేవలను కొనియాడారు.

తహశీల్దార్‌గా కుమారి

ముదినేపల్లి తహశీల్దారుగా ఎస్ఎల్ఎన్.కుమారి బాధ్యతలు చేపట్టనున్నారు. ఎన్నికల విధులు నిర్వహించేందుకు తూర్పుగోదావరి జిల్లా సామర్లకోట తహశీల్దార్‌గా పని చేస్తున్న కుమారిని ముదినేపల్లి తహశీల్దార్‌గా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు గురువారం జారీ చేసింది.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తల సేమియా భవనంలో ఆరుగురు తలసేమియా చిన్నారులకు గురువారం రక్తమార్పిడి నిర్వహించారు. డాక్టర్ ఆర్ఎస్ఆర్‌కె వరప్రసాద్‌రావు తలసేమియా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను సూచించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ఛైర్మన్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ తలసేమియా చిన్నారులతో పాటు వారి సహాయకులకు ఉచిత భోజనం ఏర్పాటు చేసిన దాత ఎలక్ట్రికల్ రిటైర్డ్ ఎఇ గున్నం రామారావుకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ కార్యదర్శి కెబి.సీతారాం, డాక్టర్ వరప్రసాదరావు, కడియాల కృష్ణారావు, గున్నం రామారావు, కమిటీ సభ్యుడు టి.రామారావు, రత్నాకరరావు, పిఆర్ఒ కెవి.రమణ పాల్గొన్నారు.



రక్తమార్పిడి చేస్తున వైద్యులు

ఆయిల్‌పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆయిల్‌పామ్ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ విమర్శించారు. ఆయిల్‌పామ్ టన్ను గెలలకు రూ.18 వేలు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఏలూరు అన్నే భవనంలో గురువారం నిర్వహించిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతేడాది టన్ను గెలలకు రూ.23 వేలు వరకు ధర వస్తే ప్రస్తుతం రూ.12,400కు పడిపోయిందని చెప్పారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు, కౌలు రేట్లతో రైతులు నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయిల్ పామ్ రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. పెదవేగి ఆయిల్ ఫెడ్ కర్మాగారంలో జరుగుతున్న అవినీతి,అక్రమాలపై సమగ్ర విచారణ జరపాలన్నారు. మిచౌంగ్ తుపాను ప్రభావంతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు, కౌలు రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ, పంటల బీమా పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు, ఆయిల్‌పామ్ రైతు సంఘం నాయకులు సిద్దిరెడ్డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా



ధర్నాలో మాట్లాడుతున్న ఎపిటిఎఫ్ నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా శాఖ అధ్యక్షులు టి.రామారావు అధ్యక్షతన కలెక్టరేట్ వద్ద గురువారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా హాజరైన సంఘం రాష్ట్ర కార్యదర్శి బిఎ.సల్మాన్‌రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులను విద్యాశాఖలో విలీనం చేసి దాదాపు సంవత్సరం కావస్తున్నా నేటికీ సర్వీసు రూల్స్ అమలు చేయకపోవడం శోచనీయమన్నారు. వెంటనే మున్సిపల్ ఉపాధ్యాయులకు సర్వీసు రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వారికి ప్రావిడెంట్ ఫండ్ సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా అధ్యక్షులు టి.రామారావు మాట్లాడుతూ మున్సిపల్ ఉపాధ్యాయులకు బదిలీలు, ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు మున్సిపాలిటీ పరిధిలోని మండల విద్యాశాఖాధికారి, డివైఇఒ పోస్టులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మున్సిపాలిటీ పరిధిలోని కొత్త ఆవాస ప్రాంతాల్లో పాఠశాలలను ప్రారంభించాలని తెలిపారు. జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి బి.రెడ్డిదొర మాట్లాడుతూ డిఎస్‌సి 2024 ద్వారా నియామకం పొందే ఉపాధ్యాయులకు రెగ్యులర్ పే స్కేల్ అందించాలని, రెండేళ్ల గౌరవవేతనం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,100 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం కాకుండా రాష్ట్రంలో ఖాళీగా ఉన్న దాదాపు 50 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందడానికి ప్రభుత్వం కృషి చేయాలన్నారు. వీటితోపాటు నూతన పిఆర్‌సి అమలు చేయాలన్నారు. డిఎ బకాయిలను, పిఆర్‌సి బకాయిలను విడుదల చేయాలన్నారు. పెండింగ్ డిఎలను మంజూరు చేయాలన్నారు. సరెండర్ లీవ్ నగదును జమ చేయాలన్నారు. ఈ ధర్నాను ఉద్దేశించి జిల్లా కార్యదర్శులు యువి.నరసింహరాజు, జె.సోమేశ్వరశాస్త్రి, ఉపాధ్యక్షులు ఎస్.దొరబాబు, కెఎన్.రమాదేవి, రాష్ట్ర కౌన్సిలర్ కె.కుటుంబరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏలూరు నగర, కొయ్యలగూడెం, లింగపాలెం, నిడమర్రు, ఏలూరు రూరల్ మండల శాఖల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెల్లదోమ ఉధృతిపై జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి - చింతలపూడి

రానున్న రోజుల్లో తెల్లదోమ ఉధృతి పెరిగే అవకాశం ఉందని, రైతులందరు తగిన జాగ్రత్తలు పాటించాలని ఉద్యాన శాఖ అధికారి ఎండి షాఫియా ఫరహీన్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెల్లదోమ రసం పీల్చే జాతికి చెందిందని తెలిపారు. పసుపు రంగు కలిగిన జిగురు అట్టలు ఎకరానికి 10-15 తోటలో తూర్పు వైపున ఉన్న చెట్లకు వరుసగా అమర్చాలన్నారు. తెల్లదోమను అదుపులో ఉంచే ఎన్‌కార్సియా అనే మిత్ర పురుగులు ప్రయోగశాలలో ఉత్పత్తి చేసే అవకాశం లేనందున సహజసిద్ధంగా అభివృద్ధి చెందిన కొబ్బరితోటల్లో నుంచి సేకరించి విడుదల చేయాలన్నారు. ఈ మిత్ర పురుగులు 6 నుంచి 8 నెలల్లో తెల్లదోమను అదుపులోకి తీసుకొస్తాయన్నారు. తెల్లదోమ ఆశించిన తోటల్లో కిటక నాశన మందులు వాడకూడదన్నారు. దీంతో సహజ శత్రువులు, పరాన్న జీవులు వృద్ధి చెంది తెల్లదోమను నియంత్రిస్తాయని తెలిపారు.

జీవిత బీమా పథకాలను సద్వినియోగం చేసుకోండి



చెక్కు అందిస్తున్న ఇండియన్ బ్యాంక్ మేనేజర్ దుర్గారావు

ప్రజాశక్తి - మండవల్లి

సామాన్య ప్రజల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవిత బీమా పథకాలను ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు కోరారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజన పథకంలో చేరి ఇటీవల మృతి చెందిన ఏడు కుటుంబాలకు బీమా ద్వారా వచ్చిన రూ.14 లక్షల చెక్కులను గురువారం ఆయన చేతులమీదుగా నామినీలకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా యోజన సురక్ష బీమా యోజన పథకాలతో కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించుకోవచ్చన్నారు. పిఎంజెజెబివై పథకానికి సంవత్సరానికి రూ.436, పిఎం ఎస్‌బిఐ పథకానికి సంవత్సరానికి రూ.20 చెల్లించి పథకాల్లో చేరితే ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు, అంగవైకల్యం సంభవిస్తే రూ.2 లక్షల వరకు బీమ అందుతుందన్నారు. మృతి చెందిన వారి కుటుంబాలు ఆర్థికంగా చితికిపోకుండా వెలుగులు నింపే ఈ పథకాలపై ప్రజలకు అవగాహన లేకపోవడం వల్ల ఉపయోగించుకోలేకపోతున్నారన్నారు. మండవల్లి ఇండియన్ బ్యాంక్ పరిధిలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో గ్రామ గ్రామాన పథకాలపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇప్పటికైనా పథకాలపై అవగాహన పెంచుకుని పథకాల్లో చేరాలని తద్వారా ఎన్నో లాభాలు పొందవచ్చని తెలిపారు. అనంతరం మృతి చెందిన వారి నామినీలకు ఒక్కొక్కరికి రూ.రెండు లక్షల చొప్పున చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు, బ్యాంక్ సిబ్బంది, బ్యాంక్ మిత్రలు, పలువురు లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

కొయ్యలగూడెం గ్రామ పరిధిలో 33 కెవి కొయ్యలగూడెం ఫీడర్ మరమ్మతులు, చెట్ల నరికివేత నేపథ్యంలో ఈ నెల రెండో తేదీ శుక్రవారం ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు. కొయ్యలగూడెం, బోడిగూడెం సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నామని, వినియోగదారులు సహకరించాలని ఇఇ రాధాకృష్ణ కోరారు.

ఎన్నికల హామీల అమల్లో మోడీ విఫలం

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఎన్నికల హామీలు అమలు చేయడంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఘోరంగా విఫలమయ్యారని ఎఐటియుసి చింతలపూడి ఏరియా గౌరవ అధ్యక్షులు టివిఎస్.రాజు విమర్శించారు. మండలంలోని మక్కినవారిగూడెం గ్రామంలో ఎఐటియుసి కార్యక్రమంలో ముఠా వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం మల్లెల సత్యనారాయణ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన టివిఎస్.రాజు మాట్లాడుతూ ఎఐటియుసి ఆధ్వర్యంలో ఎన్నో పోరాటాలు చేసి కార్మికులు సాధించుకున్న 44 చట్టాలకు నరేంద్ర మోడీ తూట్లు పొడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులంతా ఏకమై మోడీ కుయుక్తులను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. అసంఘటిత కార్మికులకు ఉపాధి గ్యారెంటీ చూపించాలని, హమాలీ కార్మికులకు ధాన్యం, మొక్కజొన్న తదితర ఆహార ధాన్యాల ఎగుమతి, దిగుమతి సమయంలో ప్రమాదం ఏర్పడితే అందుకు బాధ్యత కేంద్ర ప్రభుత్వం వహించాలన్నారు. అసంఘటిత కార్మికులందరికీ ఉచిత బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి చింతలపూడి ఏరియా ఉపాధ్యక్షులు కొండముచ్చు శ్రీనివాసరావు, ఇస్సారపు రాము, బయ్యాని ఏకాంబరం, పాలకొల్లు గంగాధరరావు, ముసునూరు కృష్ణారావు, కాళహస్తి సుబ్బారావు పాల్గొన్నారు.

3న సిఎం జభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

దెందులూరులో ఈ నెల మూడో తేదీన జరిగే సిఎం జగన్ భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఎంఎల్ఎ తెల్లం బాలరాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుట్టాయగూడెం శివాలయం నుంచి బుసరాజుపల్లి వరకు గురువారం నిర్వహించిన బైక్ ర్యాలీలో ఎంఎల్ఎ బాలరాజు, పోలవరం నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దెందులూరులో భారీ బహిరంగ సభలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు రామతులసి, సయ్యద్ బాజీ, సొసైటీ అధ్యక్షులు అరటి సత్యనారాయణ, బుట్టాయగూడెం మండల కన్వీనర్ సోదెం సుధాకర్, సర్పంచి తెల్లం వెంకాయమ్మ పాల్గొన్నారు.